సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 4 । మే । 2025



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు, కనిష్టం రూ.4 వేలు, సరాసరి రూ.14 వేలు పలికాయి.



మనసున్న మా'రాజు'

ముదిగుబ్బ మండలం ఎనుములవారిపల్లికి చెందిన డాక్టర్ శంకరనారాయణ రాజు స్వగ్రామం అభివృద్ధికి తనవంతు సాయం చేస్తున్నారు.

IIలో

గరిష్టం/కనిష్టం

40.2°/21.8°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజున అభ్యర్థుల హాజరు 65 శాతం



పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 9వ తేదీ నాటికి పరీక్షలు ముగుస్తాయి. తొలి రోజున అభ్యర్థుల హాజరు 65 శాతం నమోదయ్యింది. అనంతపురంలోని పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల, శ్రీ బాలాజీ పీజీ కళాశాల కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 594 మంది అభ్యర్థులకు గాను 389 మంది హాజరయ్యారు. 205 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. కేంద్రాల్లో ఏర్పాట్లు, మౌలిక సదుపాయల కల్పనపై ఆరా తీశారు. వేసవి దృష్ట్యా తాగునీటి సదుపాయంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఏపీపీఎస్సీ నియమ, నిబంధనలు కచ్చితంగా అమలు కావాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, లైజన్ అధికారి ఎస్‌డీసీ తిప్పేనాయక్, తహసీల్దార్ హరికుమార్ ఉన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న రెండు కార్లు

- డిప్యూటీ తహసీల్దార్ ఇంతియాజ్‌కు గాయాలు



గాయపడ్డ డీటీ ఇంతియాజ్

కనగానపల్లి: మండల పరిధిలోని మామిళ్లపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డిప్యూటీ తహసీల్దార్ ఇంతియాజ్ గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ ఇంతియాజ్, సీనియర్ అసిస్టెంట్ అన్వర్‌బాషాతో కలిసి శనివారం ఉదయం అనంతపురం నుంచి పెనుగొండ వైపు వెళ్తున్నారు. ఇదే సమయంలో బెంగళూరు నుంచి అనంతపురం వైపు వస్తున్న మరో కారు రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని ఇటువైపు వెళ్తున్న వీరి కారును ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీటీ ఇంతియాజ్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ అన్వర్‌బాషా గాయపడ్డారు. స్పందించిన స్థానికులు క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని కురుబ కులానికి చెందిన పది, ఇంటర్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు కురుబ ఉపాధ్యాయ ఉద్యోగులు సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల విద్యార్థులు ఈనెల 8వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పదో తరగతిలో 500 మార్కులు ఆపైన వచ్చిన విద్యార్థులు, ఇంటర్‌లో 900 మార్కులు ఆపైన వచ్చిన విద్యార్థులు అర్హులన్నారు. 8985997169, 9505551006, 6281140300, 9705684227 నంబర్లకు ఫోన్ చేసి వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.

మార్మోగిన నారసింహ నామస్మరణ



ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

కదిరి టౌన్: పట్టణంలోని ఖాద్రీ ఆలయం శనివారం నారసింహ నామస్మరణతో మార్మోగింది. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. స్వామి కాపులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వేళ మహిళలు ఆలయం ముందు దీపాలు వెలిగించారు. ఆలయ అధికారులు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

పక్షి జాతులు పదిలం



తాజా సర్వేలో పక్షిజాతుల సంఖ్య...	
జిల్లా	పక్షి జాతుల సంఖ్య
చిత్తూరు	169
అనంతపురం	145
విశాఖపట్నం	139
తూర్పుగోదావరి	108
వైఎస్సార్ జిల్లా	106
విజయనగరం	84
పశ్చిమగోదావరి	84

- ఉమ్మడి అనంతపురం జిల్లాలో 145 పక్షి జాతులు
- రాష్ట్రంలో అత్యధిక పక్షిజాతులున్న జిల్లాల్లో రెండో స్థానం
- 147 పక్షి జాతులతో మొదటి స్థానంలో నిలిచిన చిత్తూరు జిల్లా
- ద గ్రేట్ బ్యాక్‌యార్డ్ బర్డ్ కౌంట్ సర్వేలో వెల్లడి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా ఉద్యాన పంటలకే కాదు పశుపక్ష్యాదులకూ ఆలవాలమని తేలింది. ఇప్పటికే జింకల వృద్ధిలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉంది. చిరుత పులుల సంతతి పెరుగుదలలోనూ అంతే స్థాయిలో ఉంది. తాజాగా పక్షి జాతుల విషయంలోనూ రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడి చిట్టడవులు, గుట్టలు, నీటికుంటలు, చెరువులు వంటివి కొన్ని రకాల పక్షులకు అత్యంత ఇష్టంగా ఉన్నట్టు తేలింది. జీబీబీసీ (ద గ్రేట్ బ్యాక్‌యార్డ్ బర్డ్ కౌంట్) సర్వేలో ఈ విషయాలు తేలాయి.

145 జాతులు అనంతపురంలోనే..

తాజాగా జీబీబీసీ దేశవ్యాప్తంగా పక్షిజాతుల సమూహాలపై సర్వే చేసింది. 1,084 పక్షి జాతులు ఉన్నట్టు తేల్చింది. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, తిరుపతి, మంత్రాలయం, హిందూపురం, శింగనమల వంటి ప్రాంతాల్లో ఈ సర్వే నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 245 పక్షి జాతులు ఉన్నట్టు తేల్చగా.. అందులో 145 పక్షిజాతులు అనంతపురంలో ఉన్నాయని తేల్చారు. హిందూపురం ప్రాంతంలో స్వదేశీ పక్షులతో పాటు ఏటా విదేశీ పక్షులు కూడా వచ్చి సంతానం వృద్ధి చేసుకుని వెళుతున్నట్టు గుర్తించారు. పక్షి జాతుల హాట్‌స్పాట్‌గా తిరుపతి సమీపంలోని ఏర్పేడును గుర్తించారు.

వాతావరణ పరిస్థితులే కారణం..

అనంతపురం జిల్లాలో ఎక్కువ పక్షిజాతులు ఉండటానికి కారణం ఇక్కడి వాతావరణ పరిస్థితులేనని జీబీబీసీ చేసిన డాక్యుమెంటులో పొందుపరిచారు. వేసవిలో మూడు మాసాలు మినహా మిగతా రోజుల్లో సమశీతోష్ణస్థితి పరిస్థితులు ఉంటున్నాయి. గడిచిన పదేళ్లుగా నీటి లభ్యత కూడా కావాల్సినంత ఉండటంతో పక్షుల సంతానం ఏటికేటికీ పెరుగుతూ ఉందని గుర్తించారు. హనీ బజార్డ్, వైట్ బెల్లీడ్, సీ ఈగల్, ఎజైల్ ఫాల్కన్, పెరెగ్రెన్ వంటి జాతులు రాష్ట్రంలో బాగా ఉన్నట్టు సర్వేలో తేలింది.

భారీగా పెరుగుతున్న జింకలు.. చిరుతలు

అనంతపురం జిల్లాలో ఇటీవలి కాలంలో బట్టమేక జింకలు, చిరుత పులుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్టు తేలింది. ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, పెనుకొండ, మడకశిర, కదిరి ప్రాంతాల్లో జింకల సంతతి ఎక్కువైంది. చిరుత పులుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతున్నట్టు తేలింది. ఎలుగుబంట్లు, నక్కలు తమ సంతానాన్ని వృద్ధి చేసుకుంటుండగా, తోడేళ్ల సంఖ్య మాత్రం గణనీయంగా తగ్గినట్టు అటవీ శాఖ అధికారుల పరిశీలనలో వెల్లడైంది.

ఎన్ఎస్‌పీఆర్‌లో రేపు ఉద్యోగ మేళా

హిందూపురం టౌన్: స్థానిక ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 5న మహిళా అభ్యర్థులకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రగతి శనివారం తెలిపారు. హోసూరుకు చెందిన టాటా ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ తయారీ విభాగం, జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్తంగా మేళా నిర్వహిస్తున్నాయన్నారు. ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలతో 18 నుంచి 26 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు అర్హులన్నారు. ఉద్యోగానికి ఎంపికైన వారికి నెలకు రూ.18 వేల జీతంతో పాటు ఉచిత వసతి, భోజనం, రవాణా సదుపాయం కల్పిస్తారన్నారు. ఆసక్తి గల వారు బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలతో రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు. వివరాలకు నియామక అధికారి డాక్టర్ రవినాయక్ 9493757277 నంబరులో సంప్రదించాలన్నారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు



కదిరి అర్బన్: పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 12న అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం కదిరి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మైనుద్దీన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీన ఉదయం 9 గంటలకు బస్సు డిపో నుంచి బయలుదేరుతుందన్నారు. టికెట్టు ధర రూ.1,140 ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 7382860486 సెల్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ధర్మవరానికి చెడ్డపేరు తెచ్చారు

- 11 నెలల కూటమి పాలనలో అవినీతి, దందాలకు కేరాఫ్‌గా మార్చారు
- సహజ వనరులు కొల్లగొట్టారు.. మున్సిపాలిటీని అవినీతి కూపంలోకి నెట్టారు
- బీజేపీ నాయకులపై వైఎస్సార్‌సీపీ నాయకుల ఆగ్రహం



ధర్మవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న పార్టీ నాయకులు, కౌన్సిలర్లు

ధర్మవరం: ''ధర్మవరం పేరు చెబితే సుపరిపాలన గుర్తుకు వచ్చేది. అభివృద్ధి కళ్లముందు కనిపించేది. కానీ కూటమి సర్కార్ కొలువుదీరిన 11 నెలల కాలంలోనే ధర్మవరానికి చెడ్డపేరు తీసుకువచ్చారు. అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మార్చారు. సహజ వనరులు కొల్లగొడుతూ సొంత జేబులు నింపుకుంటున్నారు. పరిపాలన లేదు...ఒక్క సంక్షేమ పథకం లేదు. పైపెచ్చు పేదలను హింసిస్తున్నారు...ఇదేనా మీ పాలన'' అంటూ బీజేపీ నేతలపై వైఎస్సార్ సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, గజ్జల శివ తదితరులు విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఇసుక, మట్టి మాఫియా రాజ్యమేలుతున్నాయన్నారు. బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల పరిధిలోని చిత్రావతి నది నుంచి అక్రమార్కులు ఇసుకను తోడేస్తూ రూ.లక్షలు గడిస్తున్నారన్నారు. అలానే ధర్మవరం, బత్తలపల్లి మండలాల్లో కూటమి పార్టీల నాయకులు మట్టి మాఫియాగా ఏర్పడి కొండలను, గుట్టలను తవ్వి అక్రమార్జన చేస్తున్నారన్నారు. వీరి దందాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారన్నారు. ఇందుకోసం ఆర్డీఓ కార్యాలయానికి ప్రతి నెలా రూ.10 లక్షలు లంచాలు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ ప్రతి పనికి రేటు ఫిక్స్ చేసి లంచాలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇంతటి దయనీయమైన పరిస్థితిని ఇక్కడి ప్రజలు మునుపెన్నడూ చూడలేదన్నారు.

కేతిరెడ్డిపై ఆరోపణలు తగవు

ఇటీవల కాలంలో కొంతమంది బీజేపీ నాయకులు తమ ఉనికిని చాటుకునేందుకు కేతిరెడ్డిపై నిరాధార ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. కేతిరెడ్డిని విమర్శించే వారు తమస్థాయి తెలుసుకోవాలన్నారు. నిజంగా అభివృద్ధి ఎవరు చేశారో ధర్మవరం ప్రజల్ని అడిగితే తెలుస్తుందన్నారు. పట్టణానికి శాశ్వత తాగునీటి పథకాన్ని తెచ్చి నీటిఎద్దడిని నివారించిన ఏకైక నాయకుడు కేతిరెడ్డి అన్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. ఆయన కట్టించిన ఆసుపత్రిలోనే మీరు డయాలసిస్ సెంటర్‌ను పెట్టిన విషయాన్ని గ్రహించాలన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా కేతిరెడ్డి 24 వేల ఇంటిపట్టాలను మంజూరు చేయించారన్నారు. ఆర్‌ఓబీలు, అండర్ బ్రిడ్జిలు, రహదారులు, శివారు ప్రాంత కాలనీలకు సమానంగా సీసీరోడ్లు, డ్రైన్‌లు నిర్మించారన్నారు. అలాంటిది తామెందుకు అభివృద్ధికి అడ్డుపడతామని ప్రశ్నించారు. ఇప్పటికైనా చిల్లర వేషాలు మానుకుని ప్రజల కోసం పనిచేయకపోతే గుణపాఠం చెప్పి తీరుతామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు రమాదేవి, నాగరాజు, చింతా యల్లయ్య, అత్తార్ జిలాన్, వార్డు ఇన్‌చార్జ్‌లు ఎస్పీ బాషా, కేశగాళ్ల కృష్ణ, కత్తెపెద్దన్న, మట్టెద్దుల కేశవరెడ్డి, గడ్డంరంగ, బాలం గోపాల్ పాల్గొన్నారు.

రాజకీయాల కోసం జీవితాలతో ఆడుకోవద్దు

- అక్రమ కేసులు పెట్టి వేధించడం మానుకోండి
- టీడీపీ నేతలకు ఉషశ్రీ చరణ్ హితవు
- వాల్మీకి లోకేష్ కుటుంబానికి అండగా ఉంటామని వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్, చిత్రంలో టీఎన్ దీపిక, వాల్మీకి లోకేష్

చిలమత్తూరు: ''వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలను లక్ష్యం చేసుకుని అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. అధికారం ఉంది కదా అని చెలరేగి పోతున్నారు. దీని వల్ల మీకు వచ్చే లాభం ఏమిటోగానీ బాధిత కుటుంబాలు పడే కష్టాలు మాత్రం చాలా తీవ్రంగా ఉంటున్నాయి. రాజకీయాల కోసం జీవితాలతో ఆడుకోవద్దు'' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ టీడీపీ నేతలకు హితవు పలికారు. క్రికెట్ బంతి కోసం పాఠశాల భవనంపైకి ఎక్కగా అక్కడే ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు తగిలి వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్ కుమారుడు అశ్విన్ ఆరాధ్య మృతి చెందిన విషయం తెలిసిందే. టీడీపీ నేతలు పెట్టిన అక్రమ కేసుతో వాల్మీకి లోకేష్ హిందూపురం సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్నారు. దీంతో శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు కోర్టుకు వెళ్లి వాల్మీకి లోకేష్‌కు కండీషన్ బెయిల్ తెచ్చారు. ఈ సందర్భంగా సబ్‌జైలు వద్ద హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపికతో కలిసి ఉషశ్రీచరణ్ మీడియాతో మాట్లాడారు. తండ్రి జైలులో కాకుండా ఇంట్లోనే ఉండి ఉంటే ఆ బాలుడు అశ్విన్ అటువైపు వెళ్లి మరణించేవాడు కాదేమోనన్నారు. బిడ్డ మరణ వార్త విని అస్వస్థతకు గురైన లోకేష్ ఒకవైపు ప్రభుత్వాసుపత్రిలో చేరడం, అదే ఆస్పత్రిలో తన బిడ్డ విగతజీవిగా ఉండటం బాధాకరమైన విషయమన్నారు. కోర్టు ఆదేశాలతో కండీషన్ బెయిల్ రావడంతో లోకేష్‌కు తనబిడ్డ ఆఖరి చూపు చూసుకునే అవకాశం దక్కిందన్నారు. లోకేష్ కుటుంబానికి వైఎస్సార్ సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంతోనే బాలుడు అశ్విన్ మరణించాడని, దీనికి విద్యుత్‌శాఖ అధికారులు బాధ్యత వహించాలన్నారు.

అక్రమ కేసులు అన్యాయం

నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక మాట్లాడుతూ...వైఎస్సార్ సీపీ నేతలపై టీడీపీ నేతల అక్రమ కేసులు అన్యాయమన్నారు. టీడీపీ నేతలు ఫిర్యాదు చేయగానే పోలీసులు కూడా ఏమాత్రం ఆలస్యం లేకుండా కేసులు నమోదుచేసి జైలుకు పంపుతున్నారన్నారు. మోహన్ అనే వ్యక్తి వల్ల లోకేష్ జైలు పాలయ్యారన్నారు. దీనివల్ల అతను సాధించినది మాత్రం ఓ కుటుంబానికి నష్టం చేకూర్చడమేనన్నారు. అయినా చేయని తప్పుకు లోకేష్‌పై అక్రమంగా కేసు బనాయించారన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి నేతలు, పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి లోకేష్‌తో పాటు వైఎస్సార్ సీపీ నేతలను అక్రమ కేసులలో ఇరికించి జైలుకు పంపారన్నారు. కోర్టులపై తమకు నమ్మకం ఉందని, అక్రమ కేసులు బనాయించిన పోలీసులను కోర్టుముందు నిలబెడతామన్నారు.

అశ్విన్ ఆరాధ్యకు కన్నీటి నివాళి



వాల్మీకి లోకేష్ కుమారుడు అశ్విన్ ఆరాధ్య మృతదేహానికి పూలమాలలు వేస్తున్న పార్టీ నేతలు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, నాయకుడు వేణురెడ్డి, చౌళూరు మధుమతిరెడ్డి తదితరులు సబ్‌జైలు నుంచి వాల్మీకి లోకేష్‌ను వెంటబెట్టుకుని ఆయన ఇంటికి తీసుకువెళ్లారు. అనంతరం కన్నీటి నివాళుల మధ్య వాల్మీకి లోకేష్ తనయుడు అశ్విన్ ఆరాధ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు లోకేష్‌కు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి, వైఎస్సార్ సీపీ కురుబ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివ, ఆ పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్, నాగరాజు, చిలమత్తూరు మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, ధనుంజయరెడ్డి, శివశంకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఐటీ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడు గిరీష్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి, కవిత, శ్రీనివాసరెడ్డి పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

- జిల్లాలోని 27 మండలాల్లో వర్షం
- ఈదురుగాలులతో నేలరాలిన మామిడి కాయలు



గాలీవానకు కడపనాగేపల్లి వద్ద రైతు పోతిరెడ్డి తోటలో రాలిన మామిడి కాయలు

పుట్టపర్తి/పుట్టపర్తి అర్బన్: అకాల వర్షంతో జిల్లా రైతులకు అపార నష్టం జరిగింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ జిల్లాలోని 27 మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గాలీవాన బీభత్సంతో పంటలకు తీవ్ర నష్టం జరిగింది. ముఖ్యంగా మామిడితోటల్లోని కాయలన్నీ నేలరాలాయి. బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల్లో అధికంగా నష్టం వాటిల్లింది. బుక్కపట్నం మండలంలోని బుచ్చయ్యగారిపల్లి, జానకంపల్లి, కడపనాగేపల్లి తదితర గ్రామాల్లోని మామిడితోటల్లోని కాయలు రాలి కింద పడ్డాయి. దీంతో రైతులకు రూ.లక్షల నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో బీమాతో సంబంధం లేకుండా పంటనష్టం జరిగిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇక గాలీవానకు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలవాలడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాలు అంధకారంలో ఉండిపోయాయి.

సోమందేపల్లి మండలంలో అత్యధికం

సోమందేపల్లి మండలంలో అత్యధికంగా 37.2 మి.మీ వర్షం కురిసింది. ఇక పెనుకొండ 35.8, బత్తలపల్లి 35.6, గుడిబండ 32.4, బుక్కపట్నం 25.6, అమరాపురం 25.2, తాడిమర్రి 19.2, రొళ్ల 18.4, ధర్మవరం 15.6, కొత్తచెరువు 15.2, కనగానపల్లి 10.2, పుట్టపర్తి 10.2, అగళి 9, చిలమత్తూరు 8.8, తలుపుల 8.4, సీకేపల్లి 8.4, ఓడీచెరువు 7.4, హిందూపురం 6.8, మడకశిర 6.2, గోరంట్ల 6.2, రామగిరి 5.2, నల్లమాడ 4.6, రొద్దం 3.6, కదిరి 3.2, ముదిగుబ్బ, అమడగూరు, లేపాక్షి మండలాల్లో 2.2 మి.మీ చొప్పున వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

కూలిన ఇల్లు.. దంపతులకు గాయాలు



గాలీవానతో దెబ్బతిన్న ఇల్లు

పుట్టపర్తి టౌన్: అకాల వర్షానికి పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బడేనాయక్ తండాలోని ఓ ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. గోడలు కూలిపోగా ఇంట్లో నిద్రస్తున్న దుంగావత్ ప్రసాద్‌నాయక్, నిర్మలా భాయికి గాయాలయ్యాయి. గాలి ధాటికి ఇంటి పైకప్పు రేకులు గాల్లో ఎగిరిపోయి సమీపంలోని పొలంలో ఉన్న ఆవులకు తగలడంతో అవి గాయపడ్డాయి.

క్లుప్తంగా

మహమ్మదాబాద్‌లో చోరీ

అమడగూరు: మహమ్మదాబాద్ గ్రామంలోని ఓ ఇంటిలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బాధితుడి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా మూడు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలసి బెంగళూరు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలయని వ్యక్తులు ఇంటి తాళం పగుగొట్టి బీరువాలో ఉన్న 160 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం బెంగళూరు నుంచి రాగా విషయం వెలుగు చూసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో క్లూస్‌టీం రప్పించి వేలిముద్రలు సేకరించారు. సీఐ నరేంద్రరెడ్డి చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి బాధితుడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గాండ్లపెంట: మండల కేంద్రం సమీపంలోని చిన్నమిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. గాండ్లపెంటకు చెందిన పాములూరి మారుతీప్రసాద్(36) శుక్రవారం రాత్రి బైక్‌పై కదిరిలో పని ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. చిన్నమిట్ట వద్ద రాగానే గేదె అడ్డువచ్చింది. ఈక్రమంలో బైక్‌పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మనసున్న మారాజు

ఆయన పేరులోనే కాదు.. ఆచరణలో కూడా రాజును తలపిస్తున్నారు. తాను జన్మించిన ఊరిలో విస్తృతంగా అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. అనాథలకు ఆశ్రయమిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. నిరుద్యోగులకు కంప్యూటర్, మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి వారి జీవనానికి మార్గం చూపారు. అందుకే అందరి హృదయాల్లో మనసున్న మారాజుగా మారారు.

- డాక్టర్ శంకరనారాయణ ప్రజా సేవ
- సొంతూరులో అభివృద్ధి కార్యక్రమాలు
- రూ.కోటితో కాశిరెడ్డినాయన ఆశ్రమం


కాశిరెడ్డినాయన ఆశ్రమంలో నిర్మించిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం


కళ్యాణమండపం

ముదిగుబ్బ: మండలంలోని ఎనుములవారిపల్లికి చెందిన డాక్టర్ శంకరనారాయణ రాజు తన సేవల ద్వారా జన్మభూమి రుణం తీర్చుకుంటున్నారు. పుట్టిన ఊరిని మర్చిపోకుండా తన శాయశక్తులా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. సుబ్బరాజు, వెంకట లక్ష్మమ్మ దంపతులకు ఏకైక సంతానం డాక్టర్ శంకర్‌నారాయణ రాజు. ఆయన పదేళ్ల వయస్సులోనే తండ్రి సుబ్బరాజు మరణించారు. దీంతో పినతండ్రి నారాయణ రాజు పిన్నమ్మ శాంతమ్మ ఆయన్ను చేరదీసి చదివించారు. వారి సహకారంతో కష్టపడి చదివి డాక్టర్ అయ్యారు. 1959లో కర్నూలు పీహెచ్‌సీలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాడు. అనంతరం ఉస్మానియా మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. సౌదీ, ఇరాన్ దేశాల్లో ఈఎస్‌ఐ(ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) తరఫున విధులు నిర్వర్తించారు. అనంతరం ఎక్కువ కాలం హైదరాబాద్‌లోని ఈఎస్‌ఐ ఆసుపత్రిలో డైరెక్టర్‌గా పనిచేసి 2000లో ఉద్యోగ విరమణ పొందారు.

2008 నుంచి సేవా కార్యక్రమాలు..

డాక్టర్ శంకర్‌నారాయణరాజు 2008 నుంచి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎనుమలవారిపల్లి సమీపంలో మలకవేమల క్రాస్ వద్ద రెండెకరాల స్థలాన్ని కొనుగోలు చేసి అందులో రూ.కోటి వ్యయంతో కాశిరెడ్డినాయన ఆశ్రమాన్ని నిర్మించారు. అందులోనే అనాథలకు ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్యం దాదాపు 30 మంది 40 మంది దాకా వృద్ధులు ఆశ్రయం పొందుతుంటారు. లక్ష్మీనరసింహస్వామి, గణపతి దేవాలయం, నవగ్రహాలతో పాటు గ్రంథాలయం, జ్ఞాన మందిరం నిర్మించారు. సామాన్యులు వివాహాలు నిర్వహించుకోవడానికి అనుగుణంగా కల్యాణ మండపాన్ని కూడా నిర్మించారు. ఇక 2012 నుంచి 2017 వరకూ నాక్(నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ సహకారంతో నిరుద్యోగులకు కంప్యూటర్, కార్పెంటర్, మహిళలకు టైలరింగ్‌లో వేలాది మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చారు.

తండ్రి సేవకు బిడ్డల సహకారం..

డాక్టర్ శంకర్‌నారాయణరాజుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తె వాణీ మోహన్ ఐఏఎస్ అధికారిణిగా ఏపీ క్యాడర్‌లో పని చేస్తున్నారు. ఇక ఇద్దరు కుమారులు విదేశాల్లో స్థిరపడ్డారు. వీరు తండ్రి సేవా కార్యక్రమాలకు తమ వంతు సాయం అందిస్తున్నారు. ఇక శంకరనారాయణరాజు ప్రతినెలా తన పెన్షన్ డబ్బుతోనే లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పని చేసే అర్చకులు, ఇతర సహాయకులకు వేతనాలు అందిస్తున్నారు. ఇటీవల ఎనుమలవారిపల్లి హైస్కూల్‌లో క్రీడా సామగ్రి పంపిణీ చేశారు.

సేవలోనే ఆనందం



పేదలకు సేవ చేయడంలోనే ఆనందం ఉంది. ఏ హోదాలో ఉన్నా పుట్టిన ఊరిని మరువ కూడదనే ఉద్దేశంతో మా గ్రామానికి కొంతలో కొంత సేవ చేస్తున్నా. భగవంతుని కృపతో సేవ చేసే భాగ్యం దక్కింది.

– డాక్టర్ శంకరనారాయణ రాజు

మా గ్రామంలో పుట్టడం అదృష్టం



డాక్టర్ శంకరనారాయణ రాజు మా గ్రామంలో పుట్టడం మా అదృష్టం. ఇప్పటికీ మా గ్రామానికి తరచూ వస్తూ పోతుంటారు. సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి తన వంతు కృషి చేస్తుంటారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో ఎంతో మందికి ఆశ్రయం కల్పిస్తున్నారు.

– బయపరెడ్డి, ఎనుమలవారిపల్లి

మూడేళ్లుగా ఆశ్రమంలో ఉంటున్నా..



ఏ ఆధారం లేని నా లాంటి వారికి ఆశ్రమంలో మూడు పూటలా అన్నం పెడుతూ బిడ్డల్లా చూస్తున్నారు. డాక్టర్ శంకరనారాయణ రాజు లాంటి వారు లేకపోతే మా లాంటి వారి పరిస్థితి ఊహించుకోలేం. ఆయన సేవలను జీవితాంతం మరువలేం.

– లక్ష్మమ్మ, తాడిపత్రి

అప్పుల భూమి అమరావతి

- ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ రమణ

అనంతపురం కల్చరల్: పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన అమరావతి పుణ్యభూమి ఎలా అవుతుందని ఏపీ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ రమణ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నారాయణరెడ్డి, శ్రీనివాసులు ప్రశ్నించారు. ఈమేరకు వారు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీలంకను తలపిస్తూ రూ.లక్షల కోట్ల అప్పులు చేసి తిప్పలు పడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో అన్ని రంగాలు వెనక్కు పోతుంటే ప్రధాని మోదీ ఎలా పొగుడుతారని ప్రశ్నించారు. స్థిరాస్తిని కొనాలంటే మిగులు డబ్బులుండాలన్న కామన్‌సెన్స్ లేకుండా అప్పు చేసి నిర్మిస్తామనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. కూటమిలో ఉన్నంత మాత్రాన ఇక్కడి వారిని పొగడ్తల్లో ముంచెత్తిన ప్రధాని వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధి గురించి ఒక్క మాట మాట్లాకపోవడం విచారకరమని తెలిపారు. రాష్ట్ర విభజన సందర్భంగా శ్రీకృష్ణ, శివరామకృష్ణన్ లాంటి మేధావులు అధికార వికేంద్రీకరణ ద్వారానే అభివృద్ధి సాధ్యన్నారని, కానీ కేంద్రీకరణ కోసం అప్పులు చేయించడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అమరావతి పేరిట దుబారా చేయకుండా అసెంబ్లీ, హైకోర్టు, అధికారుల నివాసాల నిర్మించి మిగిలిన డబ్బుతో అన్ని ప్రాంతాల్లో సమాన అభివృద్ధి జరిగేట్టు చూడాలని, వికేంద్రీకరణ ఉద్యమాలు రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు.

సువర్ణ వాసవీ మాత విగ్రహావిష్కరణ


సువర్ణ వాసవీమాత విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి టీజీ భరత్

హిందూపురం: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన 2.5 కేజీల సువర్ణ వాసవీ మాత విగ్రహాన్ని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వందలాది మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవతో లేపాక్షి ప్రాంతంలో దాదాపు 10 వేల ఎకరాల్లో పరిశ్రమల హబ్ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు భూ సేకరణ చేపడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 10 నెలల్లోనే రూ.8 లక్షల కోట్లపైగా పెట్టుబడితో పరిశ్రమల స్థాపన కోసం పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చారన్నారు. పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, ఆర్యవైశ్యసంఘ అధ్యక్షులు జేపీకే రాము, కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు కోట సత్యం, రవికుమార్, వెంకటేష్, నరసింహులు, లక్ష్మీకాంత్,టీడీపీ నాయకులు అంజనప్ప, కౌన్సిలర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెక్కలు మీదపడి వాచ్‌మన్ మృతి

రాప్తాడురూరల్: నిర్మాణ ఇంటిలో ఉంచిన చెక్కలు ప్రమాదవశాత్తూ మీద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి కక్కలపల్లి కాలనీ పంచాయతీలోని బాలాజీ విల్లాస్ సమీపంలో జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..సుధాకర్ అనే వ్యక్తి కళ్యాణదుర్గం రోడ్డు బాలాజీ విల్లాస్ సమీపంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. సిద్దు అనే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాడు. ఇక్కడ వాచ్‌మన్‌గా చంద్రబాబుకొట్టాలకు చెందిన శంకరనారాయణ(40) ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి వర్షం కురుస్తుండడంతో నిర్మాణం జరుగుతున్న ఇంటిలోని ఓ గదిలో నిద్రపోయాడు. డోర్ కోసం తెచ్చిన చెక్కలు ప్రమాదవశాత్తూ ఆయన మీద మీదపడ్డాయి. తీవ్రంగా గాయపడిన మృతి చెందాడు. మృతుడికి భార్య జయంతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు నమోదు చేశారు.

సెల్‌ఫోన్ చూడొద్దన్నందుకు విద్యార్థి ఆత్మహత్య

అనంతపురం: సెల్‌ఫోన్‌ను పక్కనపెట్టి చదువుపై శ్రద్ధ పెట్టాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. వన్‌టౌన్ సీఐ వి.రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మున్నానగర్‌కు చెందిన కల్లూరు చంద్రకాంత్ (20) ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. చంద్రకాంత్ కళాశాలకు వెళ్లకుండా తరచూ సెల్‌ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తున్నాడు. చదువుపై శ్రద్ధ పెట్టాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన చంద్రకాంత్ శనివారం ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి అంజనేయులు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతు ఉసురు తీసిన అప్పులు


మృతుడు సబావత్ సామునాయక్

వజ్రకరూరు: అప్పులు ఓ గిరిజన రైతు ఉసురు తీశాయి. వెంకటాంపల్లి పెద్ద తండా (రూప్లానాయక్ తండా)లో శనివారం సబావత్ సామునాయక్ (44) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సబావత్ సాము నాయక్‌కు నాలుగు ఎకరాల పొలం ఉంది. అందులో ఏడు దాకా బోర్లు వేయించాడు. బోర్ల ద్వారా వచ్చే నీటి ఆధారంగా మూడేళ్లుగా మిరప సాగు చేస్తున్నాడు. మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ పెట్టాడు. అయితే పంటలు ఆశించిన స్థాయిలో చేతికి రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. పంటల సాగు, బోర్ల కోసం చేసిన అప్పులు రూ.16లక్షలకు చేరుకున్నాయి. వీటిని ఎలా తీర్చాలో అర్థం కాక రోజూ మదనపడుతుండేవాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సబావత్ సామునాయక్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలం పనులు ముగించుకుని వచ్చిన కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు తట్టగా ఎంతకూ తీయలేదు. అనుమానం వచ్చి కిటికీ లోంచి చూడగా సామునాయక్ ఉరికి వేలాడుతూ కనిపించడంతో గట్టిగా కేకలు వేశారు. దేవుడా ఇక తమకు దిక్కెవరు అంటూ కుటుంబ సభ్యులు రోదించారు. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. వజ్రకరూరు ఎస్‌ఐ నాగస్వామి తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ఆస్పత్రికి తరలించారు. రైతు సామునాయక్‌కు భార్య సామక్కబాయి, నలుగురు కుమారులు ఉన్నారు. ఎంపీపీ రమావత్ దేవి, సర్పంచ్ కొర్రా శివాజీ నాయక్ తదితరులు ఆస్పత్రికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వృద్ధురాలి ఆత్మహత్య


గార్లదిన్నె: మండలంలోని మర్తాడుకు చెందిన ఓ వృద్ధురాలు అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సైదాబీ(60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంది. అయినా ఫలితం లేకపోవడంతో మదనపడుతుండేది. ఈక్రమంలో అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సులో రూ. 70 వేల చోరీ

గుత్తి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులో ఉన్న ప్రయాణికుడి నుంచి రూ.70 వేలు చోరీకి గురయ్యాయి. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన తాయప్ప రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని స్వస్థత శాలకు వచ్చాడు. శనివారం సాయంత్రం రాయచూరు వెళ్లడానికి కుటుంబ సభ్యులతో కలిసి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లాడు. ఈక్రమంలో ఆళ్లగడ్డ బస్సు ఎక్కగా పది నిమిషాల్లోనే తన వద్ద ఉన్న రూ.70 వేలు కనిపించలేదు. దీంతో బస్సంతా వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బస్సును స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టారు.

నిజానిజాల్ని ప్రజలకు వివరిద్దాం

- వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ గ్లోబల్ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి
- మెలబోర్న్‌లో ప్రవాసాంధ్రులతో సమావేశం


మెల్‌బోర్న్‌లో ప్రవాసాంధ్రులతో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం మెడికల్: ప్రత్యక్ష రాజకీయ వేదికల కంటే సామాజిక మాధ్యమాల ద్వారా నిజం గళం వివరించి ప్రజలను చైతన్యవంతులను చేద్దామని వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం గ్లోబల్ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మెల్‌బోర్న్‌లో జరిగిన వైఎస్సార్ సీపీ గ్లోబల్ కనెక్ట్ కార్యక్రమం విజయవంతమైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలకు పథకాలు అందించడం ద్వారా సంక్షేమ విప్లవాన్ని సృష్టించారన్నారు. విద్య, వైద్య రంగానికి పెద్ద పీట వేశారని, నాడు-నేడు ద్వారా పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మార్చడమే కాకుండా అన్ని వర్గాల వారికి ఖరీదైన విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించిన విషయాన్ని గుర్తు చేశారు. పాలనలోనూ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి రాష్ట్ర వ్యాప్తంగా 15,004 సచివాలయాలను తీసుకువచ్చి ఒకేసారి 1,25,000 మందికి ఉద్యోగాలు, 2.6 లక్షల మంది వలంటీర్లకు ఉపాధి కల్పించారన్నారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి తీసుకోని విధంగా విప్లవాత్మక సంస్కరణలను తీసుకొచ్చారన్నారు. ఇంటి వద్దకే పాలననందించారన్నారు. అబద్ధాలకు గళం ఇస్తే మనం వాస్తవాలకు శబ్దం ఇవ్వాలని, డేటా, గణాంకాలు, గ్రూపులు ఇవేన ఆయుధాలని, జగనన్నను సీఎం చేసుకోవడానికి ప్రవాసాంధ్రులు పోరాట పటిమను చాటాలన్నారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా వైఎస్సార్ సీపీ కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, మెల్‌బోర్న్ కన్వీనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఆస్తినష్టం


విద్యుత్తుషార్ట్‌సర్క్యూట్‌తో ఇంటిలో నుంచి పొగలు వస్తున్న దృశ్యం

హిందూపురం: మోతుకపల్లిలో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో మంటలు చెలరేగి ఆస్తినష్టం వాటిల్లింది. బాధితుడి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పూల నాగరాజు శనివారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిడ్జిలో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న వారంతా భయంతో బయటకు పరుగులు తీశారు. దీంతో వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. అయితే అప్పటికే ఇంటిలోని వస్తువులు, బీరువా, అందులోని మూడున్నర తులాల బంగారు నగలు కాలిపోయాయి. ఘటనలో దాదాపు రూ.5 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. పూలు అమ్ముకుని జీవించే తాము అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయామని ప్రభుత్వం పరిహారం అందించాలని కోరారు.

నలుగురిపై కట్నం వేధింపుల కేసు నమోదు

బత్తలపల్లి: అదనపు కట్నం కోసం వేధిస్తున్న నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్‌ఐ తిరుపాలు తెలిపిన వివరాలు.. గుమ్మల్లకుంట గ్రామానికి చెందిన శ్రావణిని 2019లో గద్వాల్ జిల్లా కోయిలదిన్నె గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డికు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. అప్పట్లో కట్నం కింద 35 తులాల బంగారు ఆభరణాలు, రూ.6 లక్షలు నగదు ఇచ్చారు. అదనపు కట్నం కోసం నాలుగేళ్ల నుంచి శ్రావణిని భర్త, అతని తల్లిదండ్రులు నిర్మలమ్మ, కేశవరెడ్డి, బావ విజయ్‌కుమార్‌రెడ్డి మూకుమ్మడిగా తీవ్ర వేధింపులకు గురి చేశారు. దీంతో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి మహిళా పోలీస్ స్టేషన్‌లో గతంలో ఫిర్యాదు చేసింది. ఫ్యామిలీ కౌన్సిలర్ ద్వారా పిల్లల భవిష్యత్ కోసం కలిసి జీవించాలని సర్ది చెప్పారు. అయినా భర్త, అత్త, మామ, బావ ప్రవర్తన మార్చుకోకుండా వేధింపులు కొనసాగించారు. దీంతో మరోసారి రూ.2 లక్షలు తీసుకెళ్లి భర్తకు ఇచ్చింది. అయితే శ్రావణి తల్లి పేరు మీద ఉన్న భూమిని ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఇవ్వాలని ఏడాది నుంచి వేధింపులు కొనసాగిస్తున్నారు. పిల్లలను పట్టించుకోకుండా కట్నం కోసం వేధిస్తుండటంతో శుక్రవారం బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నల్లలమ్మ ఆలయంలో చోరీ

రాప్తాడు: బుక్కచెర్ల ఎస్సీ కాలనీలోని నల్లలమ్మ ఆలయంలో అమ్మవారి సొత్తులు చోరీకి గురయ్యాయి. ఆలయ నిర్వాహకులు, గ్రామపెద్దలు తెలిపిన వివరాలు.. ఆలయ పూజారి నల్లప్ప అమ్మవారికి ప్రతి మంగళ, శుక్ర, ఆదివారం పూజలు చేస్తుండేవారు. శుక్రవారం పూజలు చేసి ఆలయానికి తలుపులు వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించి 80 గ్రాముల అమ్మవారి ముఖావళి, 20 గ్రాముల 3 వెండి గొడుగులు, ఒక తులం బంగారు తాళిబొట్టును ఎత్తుకెళ్లారు. రూ.2 లక్షల విలువైన ఆభరణాలు చోరీకి గురైనట్లు కాలనీవాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు.

మద్యం మత్తులో స్నేహితుడిపై దాడి

అనంతపురం: మద్యం మత్తులో స్నేహితుడిపై దాడిపై దాడి చేసిన ఘటన శారదనగర్‌లో చోటుచేసుకుంది. వన్‌టౌన్ సీఐ వి. రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన వివరాలు..ఫెర్రర్ నగర్‌కు చెందిన మునాఫ్, శారదానగర్‌కు చెందిన మురళి మిత్రులు. మద్యం సేవించిన అనంతరం మాటామాట పెరిగింది. వ్యక్తిగతంగా దూషించుకున్నారు. స్థానికులు సర్దిచెప్పి పంపించేశారు. దూషించాడనే అవమానంతో దూషించిన మురళి నాటు కొడవలి, దుస్తులు శుభ్రం చేసే సోడా రసాయన ద్రావణం, తీసుకుని తిరిగి మద్యం షాపు వద్దకు వచ్చాడు. శారదనగర్‌లో మద్యం షాపు వద్ద మద్యం సేవిస్తున్న మునాఫ్‌పై ద్రావణం చల్లాడు. రాయి, కొడవలితో దాడికి యత్నించాడు. స్థానికులు అడ్డుకోవడంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. గాయపడ్డ మునాఫ్‌ను ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. బాధితుడి కళ్లు, ముఖం, శరీర భాగాలు దెబ్బన్నాయని, మెరుగైన చికిత్స అవసరమని డాక్టర్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు మురళిని అదుపులోకి తీసుకున్నారు.

రెచ్చిపోయిన జేసీ

- సీపీఎం నేత రాంభూపాల్‌పై అనుచిత వ్యాఖ్యలు

తాడిపత్రిటౌన్ : తాడిపత్రి మునిసిపల్ చైర్మన్, టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి రెచ్చిపోయారు. సీపీఎం రాష్ట్ర నేత రాంభూపాల్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. తన అభిప్రాయాన్ని చెప్పడమే నేరమన్నట్లుగా మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లేందుకు హైకోర్టు అనుమతి ఉన్నా జేసీ ప్రభాకర్‌రెడ్డి దౌర్జన్యంగా అడ్డుకుంటున్నారు. ఈ అంశంపై 'సాక్షి' టీవీ డిబేట్‌లో రాంభూపాల్ మాట్లాడడాన్ని జేసీ ప్రభాకర్‌రెడ్డి జీర్ణించుకోలేకపోయారు. శనివారం తాడిపత్రిలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించి ..తనదైన రీతిలో రెచ్చిపోయారు. 'స్కూల్ గ్రౌండ్‌లో టిప్పర్లతో రాళ్లు వేశామని మాట్లాడుతున్నావ్.. మాజీ ఎమ్మెల్యేను ఎందుకు వెనుకేసుకొస్తున్నావ్? ఏమైనా మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నావా? గత ఐదేళ్లు ఎక్కడికి పోయింటివి రాంభూపాల్.. ఆరోజు నన్ను పోలీసోళ్లు ముసలోడినని కూడా చూడకుండా ఎలా తోశారో చూడలేదా? నాకు నీ మీద మంచి అభిప్రాయం ఉండేది. ఈ రోజుతో నీకు మర్యాద పోయింది. నీ గురించి కూడా తీస్తా. విత్ రికార్డ్‌తో వస్తా' అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు.